
# జన్మజన్మాలకు

మధ్యాన్నం పన్నెండుగంట లైంది.

అప్పుడే అంట్లూ, ఎంగిళ్లూ పూర్తి చేసుకుని, చంటివాడికి పాలుపోసి నిద్రపుచ్చి. 'పురుషులు - సమానహక్కులు' అన్న పుస్తకం పుచ్చుకుని వీధిహాలులో కూర్చున్నాను.

ఇంతలోకే ఎదురింటి సుగుణమ్మగారి భర్త సుబ్బారావు వచ్చాడు.




"ఏం బావా! కులాసాయేనా?" అని కుశల ప్రశ్న వేశాడు.

"రావో బావా! కూర్చో" అని తలుపువార నున్న చాప క్రింద పరిచాను.

అధికార్ల మురళీధర్

# మా ఆవిడే నా భర్త

"కొత్తవా ళ్లొచ్చినట్లు యీ మర్యాద లేమిటి బావా?'' అంటూ సుబ్బారావ్ చాపమీద కూర్చున్నాడు.

"ఏం సుబ్బారావ్ బావా! యీ మధ్య ఎక్కడా కనిపించటంలేదు? పుట్టింటికి పెళ్ళాపటగా?''

సుబ్బారావ్ చేతిలోని తమలపాకు లకు యీనెలు తీసి నములుతూ అన్నాడు.

"అవునో! యీ మధ్య మా అమ్మ గారికి చాలా సుస్తీ చేసింది. అడపా-తడపా మా పెద్దక్క విశాలాక్షి ఉత్త రాలు రాస్తూనే ఉంది. కాని ఇంట్లో మగదక్షత లేక, మా ఆవిడగారు నన్ను పంపించలేదు. ఆఖరికి మా చెల్లెలు వచ్చి "మాఅన్నని పంపిస్తేగాని వీల్లేదొదినా!" అని ఎంతో బలవంతం చేస్తే నన్ను దాని సాయంతో పంపించారు.''

సుబ్బారావు తమలపాకులు నమల్డం మాని, చొక్కా చివరతో కళ్ళొత్తు కుంటూ, తిరిగి అన్నాడు.

"నేను ఇక్కడికి బయల్దేరి వచ్చేస్తు న్నప్పుడు, మా నాన్న నన్ను కావలించు కుని, ఒకటే ఏడుపు. 'ఆరుసంవత్సరాల తరవాత కన్నవారింటి గడప తొక్కావ్. పట్టుమని మూన్నాళ్ళైనా ఉండకండా వెళ్లిపోతావా సుబ్బా!' అని. మగప్రాణం బావా! పెంచి పెద్దచేసినవాళ్లకి అలాగే అనిపిస్తుంది గదా! కాని ఏం చెయ్యను? కన్నవారని, కట్టుకున్నవాళ్లని వదిలి, పుట్టింట్లో వుండిపోలేం గదా? మాఆవిడ గారు రోజుకో ఉత్తరం, గంటకో టెలి గ్రాపు. నేను కనిపించకపోతే ఒక్క క్షణం ఉండలేరనుకో బావా! పైగా ఆవిడకి హోటలు మెతుకులు బొత్తిగా పడవు. ఎంత కోపం వచ్చిందో ఏమో గాని మరి - చెప్పుకుందికి సిగ్గేస్తుంది - నువ్వువెంటనే బయల్దేరిరాకపోతే విడాకు లిచ్చేస్తానని ఉత్తరం రాశారు. 'నీ కాప రం చల్లగా వుంటే అదే పదివేలు. వెళ్లు నాయనా!' అని మా అమ్మగారు, నాన్నా అంటే నిన్నరాత్రి రైల్లో బయ ల్దేరి వచ్చాను. ఇలా గుమ్మం ఎక్కానో లేదో మా ఆవిడగారు నా మీద కారాలు, మిరియాలు నూరడం....''

"ఎందుకూ!''

"సాయం లేకండా రాత్రి ఒక్కడివీ ప్రయాణంచేసి వస్తావా? అని. యీ మధ్య దొంగతనాలు, దారిదోపిళ్లు ఎక్కు వయ్యాయట. నాకేం తెలుసూ?.... మగాళ్లని ఎత్తుకుపోతున్నారట కూడా!"

"అవునట. మా వారూ చెప్పారు. పేపరు చదివి వినిపించారు కూడా. ఆఁ... ఇంతకీ మీ అమ్మగారి వంట్లో ఎలా ఉంది?''

"వృద్ధాప్యం బావా! ఏదో... అలా ... అలా ఉంది. వయస్సుతోబాటు బెంగలు కూడా ఎక్కువౌతున్నాయి. ఏదో మందు లిప్పిస్తున్నారు. మా నాన్న రాత్రనక, పగలనక, అలా సేవలు చేస్తున్నాడు కాబట్టి, ప్రాణం నిలిచి ఉంది. ఇంతకీ, రాత ఎవరూ తప్పించలేరు గదా! మా నాన్న విభూతిరేఖలు ఉండాలనుందో, ఊడిపోవా లనుందో?... చెప్పొచ్చే దేమిటంటే... మానవ ప్రయత్నం చేస్తున్నారు... ఆ పైన అంతా ఆదిశక్తి దయ.''

"అన్నట్లు మీ తమ్ముడికి ఏదైనా సంబంధం కుదిరిందా బావా?''

"వాడి గురించే బావా, బెంగ! అందరూ మంచాలుపట్టి పోతున్నారు. కట్నం పది. పదిహేను వేలు దిమ్మరిస్తేగాని వాడి మెళ్లో తాడు పడేట్టులేదు. యీ మధ్యనే ఒక సంబంధం వచ్చింది. అమ్మాయి వకాల్తా చేస్తోందట. పట్నంలో రెండంతస్తుల భవంతున్నది. కట్నం పాతికవే లడిగారు. ఎక్కణ్ణించి తెస్తారుటో ఉన్నపళంగా అంత సొమ్ము? మా నాన్నకి బొత్తిగా కష్టం, సుఖం తెలియదు. యీ సంబంధం జరిగితీరాలని పట్టుబట్టి కూర్చున్నాడు. రాయబారాలు నడపగా, నడపగా పదిహేను వేలకి దిగారు. విశాలాక్షి అక్కయ్య పాలెంలో ఉన్న భూము లమ్మెయ్యడానికని వెళ్ళింది. ఏ మౌతుందో ఏమో? బెంగగా ఉందనుకో బావా!''

సుబ్బారావ్ కళ్లనీళ్లు తుడుచుకుని, అటూ ఇటూ చూసి, "మీవారు లేరా?" అని ప్రశ్నించాడు.

"లేరో! యిపుడే భోజనం చేసి ఆఫీసుకు వెళ్ళారు."

"అన్నట్టు. మీ వారికి వంట్లో బాగా లేదని. రెండునెలలు 'సిక్కు' చేశారని విన్నాను? మనలో మన మాట - నెల తప్పిందా మీ ఆవిడగారికి?''

"అనుమానం పడ్డాంగాని. డాక్టరమ్మ పరీక్షచేసి అదేదీ కాదన్నది బావా! ఆఫీసులో బండచాకిరీ. ఇ టికొచ్చేసరికి మా మావఁగారు వెధవ 'బంయ్... బంయ్' మని ఒకటే సంతగోల. రక్తపుష్టి తగ్గింది. రెష్టు. బలమైన ఆహారం తీసుకోవా లని డాక్టరమ్మ చెప్పి. ఏవో మందులు, మాత్తర్లు రాసిచ్చింది. ఇప్పుడు బాగానే ఉన్నారు."

"వెయ్యేళ్లకి అలాగే ఉండాలి బావా! నీకు చంద్రమ్మ మొగుణ్ని తెలుసూ?... తెలియదూ?... అవును నీకు తెలియదు. మునుపు ఆ కమలమ్మగారింటి కుడిప్రక్కవాటాలో ఉండేవార్లే. ఇప్పుడు

పెరటి వీధిలో ఉంటున్నారు. చెప్పొచ్చే మాట... ఆ చంద్రమ్మకి ఏటికోకాన్పు. ఇప్పటికే అఖుదుగురో, ఆరుగురో వెధవ లున్నారు. యింటి కింకెడు చాకిరీ చేసుకోలేక చస్తున్నా డనుకో దాని మొగుడు. గల్లెం అయిపోయాడు. ఇవా ళుదయం కాఫీగుండ బదులుకని మా ఇంటికొచ్చి. పాపం! తన కష్ట సుఖాలు చెప్పుకుని ఒకటే ఏడుపు. వాళ్ల దేం పోయింది. కని పారేస్తారు. పెంచి, పెద్దచేసేసరికి మనకి తలప్రాణం తోక్కొకొస్తుంది. అంతేనో బావా! మగ జన్మకి సుఖం లేదు.''

ప్రక్కింటివా ళ్లబ్బాయి, భద్రం పరుగెత్తుకుంటూ వచ్చాడు.

"ఏవండీ! మా నాన్న కాసిని మిరపకాయ లుంటే ఇమ్మన్నాడు. మా అమ్మగారు బజార్నుంచి తేగానే యిచ్చేస్తాట్ట."

"ఎవడు బావా! యీ గుంటడూ?" సుబ్బారావ్ ప్రశ్నించాడు.

"వీరాచారి కొడుకు.— మా ఇంట్లో మిరపకాయలు నిండుకున్నాయిరా అబ్బాయీ!" అన్నా నేను. — భద్రం వచ్చిన దారినే పరుగెత్తుకుంటూ పోయాడు.

"వీరాచారి కింత పెద్దకొడుకున్నాడో బావా!''

''వీడు ఎడ వెధవ. వీడి తరవాత కవల పిల్లలు.''



ఫొటోగ్రాఫీ యింత యింటరెస్టింగ్ సబ్జక్టనుకోలేదుస్మా!

''కవల పిల్లలే...అయ్యబాబోయ్... కానుపుకి ఒకళ్లే తేనే చస్తున్నాం. ఇద్దరూ ముగ్గురూ అయితే ఇంకేమన్నా ఉందీ?" గుండె బాదుకున్నాడు సుబ్బారావ్.

"ఎండలో వచ్చాడు పాపం! నాలుగు మిరపకాయ లిస్తే ఏం బావా?" అన్నాడు సుబ్బారావ్.

''నీకు వీళ్ల సంగతి తెలియదు సుబ్బారావ్! ఎప్పుడూ అప్పని, సప్పని పుచ్చుకోడమేగాని, బదులు తీర్చడం అంటూ లేదు. ఒకసారి యిస్తే అదే పనిగా నొల్లుకు పోవడం. అందరివీ సంసారాలేనా? మా వారు నెలకు సరిపడ్డ సామానంతా ఒకేసారి తీసుకొచ్చి

ఇంట్లోపడేస్తారు. మధ్యమధ్య తెమ్మంటే తీసుకురారు సరిగదా, కర్రకూడా పుచ్చు కు-టారు. మా ఆవిడగారితో మంచిగా ఉంటేనే...''

"అప్పు అ-టే జ్ఞాపకం వచ్చింది... మా ఇంటి మేడ వాటాలో ఉన్నారే... కోటయ్య... అదేను బావా, రమామణి మొగుడు — రెండునెలల క్రిందట మా ఇత్తడిగళాసు లేదూ—పెద్దది.... దాంతో పంచదార బదులు తీసుకు వెళ్లాడు. ఇంతవరకూ పంచదార అతీ, గతీలేదు. పోనీ గళాసైనా పారెయ్యరా అంటే అదీ యివ్వడు. దుక్కలాంటి గళాసూ, వీడిఎదాన కొట్టాను....వళ్లు మండిపోయి వెధవతో మాట్లాడ్డం మానేశాను.''

సుబ్బారావ్ ముక్కు 'జిర్ర'ని చీది, చెయ్యిగోడకురాసేసినన్ను ప్రశ్నించాడు.

"నువ్వు కొత్త రిలీజు బయస్కోపు చూశావూ బావా? దాని పేరేమిటయ్యా... నోట్లోనే ఆడుతోంది.... ఉష్.... అబ్బ .... ఏమిటదీ.... ఆఁ.... చంద్రభాను"

"చూడలేదు సుబ్బారావ్ బావా!''

''ఏం ఇక్కడ విడుదల కాలేదూ?"

''ఉహుఁ— లేదు.''

''చూడవలసిన బయస్కోపు. చంద్రభానుడు వేశాడు. వాడూ.... లక్ష్మణరావు... ఏవి ఏక్షను చేశాడో! సినిమా చూస్తూ ఏమి ఏడిచానో నేను, చొక్కా తడిసిపోయింది.''

ఉన్నట్టుండి వీధిలో పెద్దకేకలు విని పించాయి. సుబ్బారావ్ ఆత్రుతగా లేచి, వీధిగడపలో నుంచుని, క్షణం చూసి తిరిగొచ్చాడు.

"ఏమిటి బావా! రామారావూ, ఆంజ నేయులూ దెబ్బలాడుకుంటున్నారూ?''

''పోనిస్తూ. రోతవెధవలు తయా రయారీ వీధిలో.''

"విషయం ఏమిటో చెప్పకూడదో?" టొకాయించాడు సుబ్బారావ్.

"ఏముందీ? రామారావు పెళ్లాం రిలీవి-గు రైలు మిస్సెస్సు. వారం పది రోజులయి, డ్యూటీమీద బిస్సంకటక్, మునిగుడా ఏజన్సీలకి పోయింది. ఆంజ నేయులు పెళ్లాం.చుక్కమ్మ సినిమా లనీ, నాటకా లనీ ఇంట్లో చెప్పి రామారావుతో గడుపుతోందట రాత్రిళ్లు...''

"అవ్వ... అవ్వ.." బుగ్గలు నొక్కుకున్నాడు సుబ్బారావ్.

"చూసినవా ళ్లెవరో ఆంజనేయులు చెవిలో ఊదేశారు. అప్పట్నించీ యిద్దరూ రోజూ కొట్టుకు చస్తున్నారు."

"ఛి... ఛీ... ఏం పాడు? నలుగురూ కుమ్మక్కయి వెధవల్ని తన్ని తరి మెయ్యలేక పోయారటో బావా? యీ వీధి కెంత అప్రదిష్ట; మన కెంత తల వంపులు?''

"పోనిస్తూ, మన కెందుకా గొడవ."

సుబ్బారావ్ గోడగడియారం కేసి

చూసి "ఇహ వస్తా బావా!" అంటూ లేచాడు.

నేను వంటింట్లోకి పోయి, ఇంత విభూతి, రెండు తమలపాకులు, ఒక వక్క పుచ్చుకుని వచ్చి, సుబ్బారావ్ నుదుటికి విభూతి రాసి, తాంబూలం చేతిలో పెట్టాను.

"వస్తా బావా!" అంటూ సుబ్బారావ్ వెళ్లిపోయాడు.

నాలుగుగంట లైంది. చంటివాడు, వాడి ధర్మమా అని, ఇంకా నిద్రనుండి లేవలేదు. బొగ్గులుపొయ్యి అంటించి, కాఫీనీళ్లు పెట్టాను.

ఉదయ మనగా తిండి తిని, ఊరు మీదికి చాంద్రాయణానికి పోయిన మా మామగారు వచ్చారు. ఇంట్లో అడుగు పెడుతూనే కళ్లెర్రచేస్తూ అడిగారు.

"ఏమిరా, కాఫీ చేశావూ?"

"ఇప్పుడే పొయ్యి అంటించాను."


"ఎన్నిగంట లైందేం ఇప్పుడు?"

"నాలుగు...."

"ఆహాఁ! నాలుగా? మాటకు మాట సమాధానం చెప్పడంకూడా నేర్చావ్? ఆఁ?"

"మాటకు మాట నేనేం సమాధానం చెప్పాను? గంట ఎంతైందంటే నాలుగయిందన్నా. అదేమహాపరాధమా?"

"తప్పా? తప్పన్నరా? నేనెవ ణ్ననుకున్నావ్? రానీ... రానీ నా



"ఎం గురూ షర్టు ప్యాంటు సెలెక్షన్ బాగా చేసావ్ లాటరి గాని ఏమయినా తగిలిందా?"
"చెప్తాను భాయి. ముందల ఆ రోడ్డు లోకి వెళ్దాం ఈ షాపు దోభీకి ఇవాళ కన్పిస్తానన్నాను."

కూతు ర్రానీ, నీ పని చెప్తా. పిలక నిగడదీయించేస్తాను."

నాకు వల్లమాలిన దుఃఖ మొచ్చింది. చొక్కాలో ముఖం దాచుకున్నాను.

"అబ్బోసి! ఏడుపొచ్చిం దేం? 'పెళ్ళాన్నికొట్టి మొగసాల కెక్కాడట'- అనవలసినమాట లేవో అనేసి, ఇంకా కల్లబొల్లి ఏడుపు లేడుస్తున్నావా? నోర్ముయ్.... గునిసావంటే నడ్డి విరిచేస్తాను."

ఇంతలో సైకిలు బెల్లు వినిపించింది. మా ఆవిడగారు జోడు చప్పుడుచేస్తూ లోనికి వచ్చారు. ముఖం చిట్లిస్తూ




మమ్మల్ని చూసి, గదిలోనికి వెళ్లి పోయారు.

కాఫీ తయారు చేసి, కప్పులో పోసి, వెండిప్లేటులో బ్రిటానియా బిస్కత్తులు నాలుగు పెట్టి. నేను మావారిదగ్గరకు తీసుకుని వెళ్ళాను.

కూతురు రావడం గమనించి, మా మామగారు గొరక చీపురు తీసుకుని, పెరడు ఊడుస్తున్నారు.

మా ఆవిడగారి కాలిజోడు విప్పుతుండగా, వారు నా గెడ్డం పుచ్చుకుని, ముఖం మీది కెత్తి "ఏమిటి సంగతి?" అని ప్రశ్నించారు.

"ఏంలేదు" కళ్లనీళ్లు తిప్పుతూ నేను తలదించాను.

"ఊరుకో. వాడి తత్వమే అంత. ఏదో సర్దుకుపోవాలిగాని...."

"ఆయన ఎంతలేసి మాట లంటున్నారో మీకేం తెలుసు?"

"ఆ వయస్సే అంత. విచక్షణా జ్ఞానం ఉండదు. మంచివాడివికదూ! వెళ్ళి ముఖం కడుక్కుని, బట్టలు మార్చుకో. ఇవాళ బీచికి వెళదాం."

నేను ముఖం చాటంత చేసుకుని, తువ్వాలు తీసుకుని పెరట్లోకి పరుగెత్తాను.

బట్టలు మార్చుకుంటూండగా. దొంగలాగ ప్రవేశించాడు మా వెధవ మామగారు.

"ఎక్కడికి కా ముస్తాబు?"

"బీచికి వెళదా మని...." బిడియ పడుతూ అన్నాను.

"ఇంట్లో వంటెవడు చేస్తాడనుకున్నావ్ ?"

"మీ రీపూటకు వంట చెయ్యరాదా మావఁగారూ ?"

"నువ్వు ఊరుమీద తిరుగు. నేనింటి చాకిరీ చేస్తాను. వెళ్ళు.... వెళ్ళు. ఎలా వెళ్తావో చూస్తాను." మామగారు వెళ్ళిపోయారు.

ఏంచెయ్యాలో తోచక, తటపటాయిస్తూ ఉండగా చంటివాడి నెత్తుకుని మా ఆవిడగారు వచ్చారు.

"ఏం ? ఇంకా తెమల్లేదూ ?"

"అయిపోయింది...."

"ఊఁ. తొందరగా కానీయ్."

నేను మావారి దగ్గిరగా వెళ్ళి, ఆవిడ కళ్ళలోనికి దీనంగా చూశాను.

"మీరు వెళ్లి రాకూడదూ ?"

"మళ్ళీ ఏమొచ్చింది ?"

"మామగారు...."

"వీడొహడు. సున్నప్పిడతలాతినేస్తున్నాడు." మాఆవిడగారు చికాకుపడ్డారు.

"మరేం ఫరవాలేదు. వాడి తత్వమే అంత. నీకొచ్చిన భయం ఏంలేదు. నీ ప్రాణానికి నాప్రాణం అడ్డు బయల్దేరు."

చంటివాణ్ణి తీసుకుని ఆవిడ వీధిలోనికి నడిచారు.

నేను జోడు తొడుక్కుంటూండగా, కాలయముళ్ళా మా మామగారు మళ్ళీ వచ్చారు.



"నీకులాగ సన్నంగా అవడానికి ఏదైనా సలహా చెపుదూ ?"
"ముందు బాగా తినడం మొదలుపెట్టు. తరువాత బద్ధకం ఎక్కువై పనిచెయ్యలేవు. అప్పుడు నిన్ను డిస్మిస్ చేస్తారు. ఉద్యోగం పోయాక బెంగపెట్టుకుని చిక్కుతావు !"

"బయల్దేరుతున్నావన్నమాట?"

"ఆ.... వెళ్తున్నా." విసురుగా అన్నాను నేను.

"వెళ్ళు. యివాళరాత్రి నీకు చురకలు తగిలించకపోతే నాపేరు బ్రహ్మయ్య కాదు...."

నేను చెమ్మగిల్లినకళ్లను, రుమాలుతో తుడుచుకుంటూ వీధిలో నిలబడ్డ మా ఆవిడగార్ని కలిశాను.

బీచి కలకల్లాడుతూ ఉంది. చీకటి పడింది. లైట్లు వెలిగాయి. పూర్ణచంద్రుడుదయించాడు. చంటివాడి కేంసరదావో

చెప్పలేను, తలమీంచి యిసకపోసుకుని ఒకటే ఆట.

మా ఆవిడ నన్ను దగ్గరగా లాక్కుని "చూశావా ఆ చందమామని? ఎంత బావున్నాడో?" అన్నారు.

నాకు చచ్చేటంత సిగ్గయింది.

"అబ్బ....ఉండండి. నలుగురూ చూస్తారన్న సిగ్గయినా లేదు మీకు"

మావారు కిలకిలా నవ్వారు.

దార్లో. హోటల్లో భోంచేసి ఇల్లు చేరుకున్నాం. మా మామగారు వీధి అరుగుమీద కూర్చుని, అధ్యాత్మ గీర్వా యణం పారాయణ చేస్తున్నారు - కట్టెతో కైలాసం పోదామని.

"అయిందా షికారు?"

నేనేం జవాబివ్వలేదు.

"ఆకలవుతోంది. తొందరగా వంట చెయ్యి" అన్నారు మా మామగారు.

"యివాళ సోమవారం. ఫలహారమే గదూ" అన్నాను నేను.

"అవున్రోయ్. నామతి మండిపోనూ ....యివాళ ఫలారమే!"

నేను గబగబా మడికట్టుకుని, ఉప్పు పిండి చేసి. వడ్డించాను.

మామగారు ఒక్క కడితిని చర్రున లేచాడు.

"ఉప్పు గండ కషాయం చేశావు గదరా, నీ మొహం కాల్చా. నన్ను చంపేస్తావా ఏమిట్రా, యిలాటి పదార్థాలు పెట్టి?"

మామగారి కేకలు విని. కళ్లు నులుము కుంటూ మా అవిడగారు వచ్చారు.

"ఏమిట్రా నాన్నా?"

"చూడవేతల్లీ! నీమొగుడు పలారం చేశాడు, ఉప్పు గండకషాయం. నేనేం మనిషి ననుకున్నాడో. దున్నపోతు నను కున్నాడో! జెష్టపెద్దిగాడు దొరికాడు. నన్నిలా అగ్గీ, కర్రా లేకండా కాల్చేస్తు న్నాడు. నే నీ ఇంట్లో ఒక్క క్షణం ఉండను. పోతాను నా పెద్ద కూతురు దగ్గిరకి. అదే నన్ను కడుపులో పెట్టుకుని, కాలు కింద పెట్టనివ్వకుండా జరిపిస్తుంది. నన్ను పంపించెయ్యవేతల్లీ! వీడి పోరు పడలేనూ..." దీర్ఘాలు మొదలెట్టాడు.

నేను బిత్తరపోయి చూస్తూ నించు న్నాను.

మా ఆవిడగారు కోపంగా నన్ను చూసి "కాస్త చూసుకునిచేస్తే ఏమైంది?" అని విసుక్కున్నారు.

"మీరు తిని చూడండి. ఆమాత్రం ఉప్పుపిండి చెయ్యడమే చేతకాలేదూ? అనాలని అంటున్నారుగాని..."

మా వారు పళ్లెంలోని ఉప్పు పిండి కాస్త తిని, "బాగానే ఉందే!" అన్నారు.

మామగారు, వెర్రెత్తినట్లు గెంతడం ప్రారంభించాడు.

"ఓహో! బాగుందీ! మరేం? మొగుణ్ణి వెనకేసుకొస్తున్నావ్! అంతే తండ్రి విష మయ్యాడు, మొగుడు బెల్ల మయ్యాడు."

"ఏమిట్రా నాన్నా అవి? నోరుంది కదా అని పారేసుకోడమే? వాడేం చేశాడని? మా వారు అగ్గిమీద గుగ్గిలం అయ్యారు. నాకెంతో సరదా వేసింది.

మామగారు భోరున ఏడుస్తూ అన్నారు.

"నువ్వా నన్ను అంటున్నావా? అను... నా పెళ్లాం చచ్చిపోయింది, ఇలా దిక్కు లేనివాడి నయ్యాను. ఆ మహారాణి నన్ను పువ్వుల్లోపెట్టి పూజించేది. చచ్చి ఏ స్వర్గాన్నుందో! నే నీ కొంపలో ఒక్క క్షణం ఉండను. పెళ్లాం మొగుడూ ఏకమై ఇలా కాల్చుకు తింటూంటే భరించడం ఎవరితరం?"

మామగారు లేచి. మూటా ముల్లె సర్దుకుని. సామాను వీధి అరుగుమీద పడేశాడు.

"రైలుఖర్చియ్యి. పోతాను."

మాఆవిడగారు పదిరూపాయలనోట్లు నాలుగు పర్సులోంచి తీసి యిచ్చేశారు.

"ఏమిటిది మావా! మమ్మల్ని ఇలా కాదని వెళ్లిపోవడం నీకేం న్యాయం? ఇదేం పరాయికొంపా? మీ కూతురు. అల్లుణ్ణాను. కోపం ఉపసంహరించుకుని ఇంట్లోకి రా" అని నేను బ్రతిమలాడగా, ఆయనగారు హుక్కా, మూతీ విసుర్తూ ఇంట్లో కొచ్చి. గిన్నెడు ఉప్పుపిండీ తినేసి, నిద్ర కొరిగాడు.

"నువ్వలా ఉండబట్టే నిన్ను నానా హైరానా పెడుతున్నాడు. కావలసిందే. అనుభవించు" అనేసి మా ఆవిడ వెళ్లిపోయారు.

పెరట్లో పను లన్నీ పూర్తి చేసుకుని, తలుపులు వేసి, లైట్లార్పి. పాలగ్లాసుతో గదిలోనికి వెళ్ళాను.

మా ఆవిడగారు అప్పుడే చంటివాడికి పాలిచ్చి నిద్రపుచ్చారు.

పా లందుకుని. త్రాగి, గ్లాసు నాకు తిరిగి అందిస్తూ నన్నుచూసి చిలిపిగా నవ్వారు. నేనూ నవ్వాను.

"ఏమిటి సంగతి?" ప్రశ్నించారు మా శ్రీమతి.

"గుర్తే లేదా? యీరోజు మన పెళ్ళయింది."

"వాట్! మై గుడ్ గాడ్! మన మేరేజి ఆనివర్సరీ! ముందే చెప్పావు కాదేం? కొత్తబట్టలు తెచ్చుందేదాన్ని?"

"ఎందుకులెస్తురూ, డబ్బు దండగ."

"ఏదీ నీప్రెజెంటు ... ఒక్క ..."

"అబ్బ. ఉండండి..." అని లైటార్పేశాను పకపక నవ్వుతూ, జన్మజన్మాలకు యీమెనే నా భర్తగా అనుగ్రహించమని హృదయంలో దైవాన్ని వేడుకుంటూ. ★